# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం

తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 154 క్రిష్ణా, శనివారం 28- 02 - 2026 పేజిలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## నేడు విజయనగరం జిల్లాకు సీఎం



క్రైం కౌంటర్ న్యూస్, విజయనగరం, ఫిబ్రవరి 27 సీఎం చంద్రబాబు శనివారం విజయనగరం జిల్లా చీపురుపల్లి రానున్నారు. ఆ నియోజకవర్గంలో నిర్వహించే హెచ్‌పీవీ వ్యాక్సినేషన్, ఎన్టీఆర్ భరోసా పింఛను పంపిణీలో, రావివలసలో జరిగే ప్రజావేదికలో పాల్గొంటారు. చీపురుపల్లి ఏరియా ఆసుపత్రిలో జరిగే హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌కు హాజరవుతారు. ఇదే కార్యక్రమాన్ని రాజస్థాన్‌లోని అజ్మీర్ నుంచి ప్రధాని మోదీ ప్రారంభిస్తారు. జాతీయ స్థాయిలో జరిగే ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమంలో చీపురుపల్లి నియోజకవర్గంలోని రావివలస నుంచి సీఎం చంద్రబాబు వర్చువల్‌గా పాల్గొంటారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ బారిన పడకుండా 14 ఏళ్లు దాటిన బాలికల కోసం నిర్వహిస్తున్న ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమానికి వచ్చిన బాలికలతో సీఎం నేరుగా మాట్లాడతారు.

## సొంతింటి కోసం ఎదురుచూస్తున్నవారికి సీఎం చంద్రబాబు భారీ శుభవార్త..

# స్థలం కూడా ఫ్రీ.. ఎప్పటినుంచంటే..?

క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 27: ఏపీ ప్రజలకు సీఎం చంద్రబాబు భారీ శుభవార్త అందించారు. రాష్ట్రంలో సొంతిళ్ల కోసం ఎదురుచూస్తున్నవారికి తీపికబురు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్త ఇళ్ల కోసం చాలామంది ఎదురుచూస్తున్నారు. ఎప్పుడెప్పుడు మంజూరు అవుతాయా, పంపిణీ చేస్తారా అని నిరిక్షిస్తున్నారు. వారి నిరిక్షణకు ఎట్టకేలకు తెరపడింది. కొత్త ఇళ్ల మంజూరు, నిర్మాణంపై అసెంబ్లీలో చంద్రబాబు శుక్రవారం కీలక ప్రకటన చేశారు. ఈ ఏడాది చివరి నాటికి 10 లక్షల ఇళ్లను పూర్తి చేసి గృహప్రవేశాలు పూర్తి చేయించాలనే లక్ష్యం నిర్దేశించుకున్నట్లు ప్రకటించారు. కొత్త ఇళ్ల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. ప్రతి పేదవానికి సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని వ్యాఖ్యానించారు. ఇప్పటికే సుమారు 3 లక్షల ఇళ్లకు గృహ ప్రవేశాలు చేపట్టామని స్పష్టం చేశారు.

2029 నాటికి పేదలకు స్థలాలు

శుక్రవారం అసెంబ్లీలో హౌసింగ్, వ్యవసాయ శాఖ పద్దులపై సీఎ చంద్రబాబు కీలక ప్రసంగం ప్రసంగించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "గత వైసీపీ ప్రభుత్వం కొత్త ఇళ్ల నిర్మాణంలో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడింది. ఇసుక విధానాన్ని కూడా అస్తవ్యస్తం చేసి భారీగా అవినీతికి పాల్పడ్డారు. ఈ అక్రమాల్లో పాల్పడిన వారిని చట్టపరంగా కఠినంగా శిక్షిస్తాం. రాష్ట్రంలో 2.20 లక్షల కుటుంబాలకు ఇంటి స్థలాలు లేవు. వారందరికీ పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఉచితంగా మా ప్రభుత్వంలో త్వరలో కేటాయిస్తాం. అందరికీ ఇళ్లు ఇవ్వాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యం. రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణాలను శరవేగంగా చేపడుతున్నాం. ఇప్పటికే 3 లక్షల ఇళ్ల నిర్మాణాలను రాయచోటి నుంచి ప్రారంభించాం. ఈ ఏడాది ఉగాదిలోగా దాదాపు 3 లక్షల





ఇళ్లల్లో గృహప్రవేశాలు చేయిస్తాం. జూన్‌కు 2.26 లక్షలు, సెప్టెంబరులో 2.10 లక్షల ఇళ్లకు కూడా గృహప్రవేశాలు జరిపేలా చేస్తాం. 2029లోగా పేదలందరికీ ఇళ్లు కట్టించటంతో పాటు ఉచితంగా ఇంటి స్థలాలు కూడా ఇస్తాం" అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

ఏఐ సేవలు

"ఇక రైతులకు అందించే ఉచిత విద్యుత్ కోసం 2026-27 బడ్జెట్‌లో భారీగా కేటాయింపులు చేశాం. ఇక అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతి రైతుకు 3 విడతల్లో రూ.20 వేల ఆర్థిక సాయాన్ని అందిస్తున్నాం. గత ప్రభుత్వం కేవలం రూ.7,500 మాత్రమే ఇచ్చింది. ఇప్పుడు కేంద్రం వాటా రూ.6 వేలతో కలుపుకుని రూ.20 వేలు మా ప్రభుత్వం ఇస్తోంది. 47 లక్షల మంది రైతులకు 2 విడతల్లో రూ.6,309 కోట్లు రైతులకు అందించాం. రూ.310 కోట్లు పంట నష్టం సొమ్మును చెల్లించాం" అని చంద్రబాబు తెలిపారు.

## బాబు దూరదృష్టితో వ్యవసాయానికి స్వర్ణయుగం



క్రైం కౌంటర్ న్యూస్, అమరావతి, ఫిబ్రవరి 27: రైతు సంక్షేమం, రాష్ట్ర ఆర్థిక పురోగతికి కీలకమైన వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అధిక ప్రా ధాన్యం ఇస్తోందని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. రైతుల ఆదాయం పెంపు, సమర్థంగా వనరుల వినియోగమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు దూరదృష్టితో వ్యవసాయానికి స్వర్ణయుగం వచ్చిందని, వ్యవసాయాన్ని యాంత్రీకరణ స్థాయి దాటి డ్రోన్ వినియోగం వరకూ తీసుకెళుతున్నామని చెప్పారు. వ్యవసాయ రంగంపై అసెంబ్లీలో చర్చ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వికసిత్ ఆంధ్రప్రదేశ్ 2047 లక్ష్యాలకు అనుగుణం గా వ్యవసాయ రంగంలో కనీసం 15శాతం వార్షిక వృద్ధి సాధించాలనే లక్ష్యంతో ప్రణాళికా బద్ధంగా పనిచేస్తున్నాం. 2024-25లో 11.64 శాతం వృద్ధి నుంచి ప్రస్తుత ఆర్థిక సం వత్సరంలో 16శాతం సాధించాం. ఉచిత వ్యవసాయ విద్యుత్ 22.5లక్షల పంపుసెట్లకు రోజూ 9గంటలు ఇస్తూ రూ.13,241కోట్ల సబ్సిడీ భరిస్తున్నాం. గత ప్రభుత్వంలో ధరల స్థిరీకరణకు రూ.7700కోట్లు కేటాయించినట్లు చెబుతున్నవన్నీ అబద్ధాలే. ఐదేళ్లలో కేవలం రూ.1475కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. నాలుగు లక్షల పశువులు కొనుగోలు చేసినట్లు పేపర్లలో చూపించి ఒక్కటంటే ఒక్కటి కూడా కొనుగోలు చేయలేదు. రాష్ట్రంలోని రైతులకు కేంద్ర పథకాలను సైతం(మ్యాచింగ్ గ్రాంట్ 40శాతం కట్టలేక) సద్వినియోగం చేసుకోని దుర్మార్గులు వైసీపీ పాలకులు' అంటూ మండిపడ్డారు.

# మంత్రి లోకేశ్‌కు ఘన స్వాగతం

**విమానాశ్రయం, పార్టీ కార్యాలయంలో వినతులు స్వీకరణ**

**నేడు అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలంలో బ్లూ జెట్ హెల్త్ కేర్ కంపెనీకి భూమి పూజ**



క్రైం కౌంటర్ న్యూస్, విశాఖపట్నం/గోపాలపట్నం, ఫిబ్రవరి 27 రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖల మంత్రి నారా లోకేశ్ శుక్రవారం రాత్రి 10.30 గంటలకు ముంబై నుంచి ప్రత్యేక విమానంలో నగరానికి చేరుకున్నారు. ఎయిర్‌పోర్టులో ఆయనకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, పి.గణబాబు, విశాఖ, అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గాల పార్టీ అధ్యక్షులు చోడే వెంకట పట్టాభి, బత్తుల తాతయ్యబాబు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, నాయకులు గండి బాబ్జీ, కిడారి శ్రావణ్‌కుమార్, గిడ్డి ఈశ్వరి, దువ్వారపు రామారావు, పీవీజీ కుమార్, బుద్దా నాగజగదీష్, దాడి రత్నాకర్, తదితర నాయకులు స్వాగతం పలికారు. విమానాశ్రయంలో ఆయనతో పలువురు ప్రయాణికులు ఫొటోలు దిగారు. కొందరు అర్జీలు అందజేయగా పరిశీలించి, పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం నగరంలోని పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ వినతులు స్వీకరించారు. రాత్రికి పార్టీ కార్యాలయం ఆవరణలో బస్సులో బస చేశారు. శనివారం ఉదయం తొమ్మిది గంటలకు అనకాపల్లి జిల్లా రాంబిల్లి వెళతారు.

అచ్యుతాపురం సెజ్‌లో బ్లూ జెట్ హెల్త్‌కేర్ ఫార్మా

అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల పరిధిలోని ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్)లో రూ.2,300 కోట్లతో ఏర్పాటుకానున్న బ్లూ జెట్ హెల్త్‌కేర్ ప్రైవేటు లిమిటెడ్ ఫార్మా కంపెనీకి శనివారం ఉదయం మంత్రి లోకేశ్ భూమి పూజ చేస్తారు. ఇక్కడ 102.48 ఎకరాల్లో మూడు దశల్లో ఫార్మా కంపెనీని నిర్మించనున్నారు. మొదటి దశ 2027కు, రెండో దశ ఏప్రిల్ 2030కి, మూడో దశ అక్టోబరు 2031కి పూర్తవుతాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు ఐదు వేల మందికి ఉపాధి లభిస్తుందని అధికారులు చెబుతున్నారు. శంకుస్థాపన అనంతరం మంత్రి లోకేశ్ కంపెనీ ప్రతినిధులు, అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం రెండు గంటలకు రోడ్డు మార్గంలో బయలుదేరి 3.15 గంటలకు విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుంటారు.

# మండలిలో 'లడ్డూ చర్చ'పై వాదోపవాదాలు

## పాలకపక్షంపై మోషేన్‌రాజు ఆరోపణలు ఖండించిన అధికార పక్ష సభ్యులు



క్రైం కౌంటర్ న్యూస్, అమరావతి, ఫిబ్రవరి 27: శాసనమండలిలో కీలక పరిణామం చోటుచేసుకుంది. తిరుమల లడ్డూ ప్రసాదంపై చర్చ ను గురువారం పాలకపక్షమే అడ్డుకుందని చైర్మన్ మోషేన్‌రాజు అన్నారు. చైర్‌ను అవమానించారని ఆరోపించారు. దీనిని మంత్రు లు, టీడీపీ ఎమ్మెల్సీలు ఖండించారు. చర్చను వైసీపీయే అడ్డుకుందని చెప్పారు. శుక్రవారం మండలి సమావేశం ప్రారంభం కాగానే.. చైర్మన్ మాట్లాడారు. 'నిన్నటి రోజు(గురువారం) సభ పునఃప్రారంభమైనప్పుడు.. ప్ర శ్నోత్తరాలను డీమ్డ్ చేసిన తర్వాత కూడా అధికార పార్టీ సభ్యులు రూల్స్‌కు విరుద్ధంగా క్వశ్చన్ అవర్ జరిపించాలని అడిగి.. లడ్డూ ప్రసాదంపై లఘు చర్చను అడ్డుకునే ప్రయ త్నం చేయడం విచారకరం. అదే సందర్భంలో ఆర్థిక మంత్రి నాపై కొన్ని సత్యదూరమైన ఆరోపణలు చేయడం కూడా కరెక్టు కాదు. లఘు చర్చ జరిపే సన్నాహక చర్యల్లో భాగం గా సెక్రటరీ జనరల్ సంబంధిత శాఖ ముఖ్య కార్యదర్శికి లఘు చర్చ టాపిక్‌పై నోట్స్ పంపిన ప్రతిని చూపించి.. స్టేట్‌మెంట్ ఇవ్వడానికి నేను అంగీకారం తెలిపిన పత్రంగా నమ్మబలికే ప్రయత్నం చేసి, సభను తప్పుదోవ పట్టించే యత్నం చేశారు. అదీ కరెక్టు కాదు. ఇరు పక్షాల సభ్యులూ సభ గౌరవాన్ని పెంపొందించే విధంగా నడుచుకోవాలని తెలియజేసుకుంటున్నా' అని తెలిపారు. పలువు రు మంత్రులు, అధికార పార్టీ సభ్యులు తమ స్థానాల వద్ద నిలబడి ఆయన వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. మీరు మాట్లాడి న దానిపై క్లారిటీ ఇవ్వాలి కదా అని మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడే ప్రయత్నం చేయ గా.. వద్దని చైర్మన్ వారించారు. మంత్రులు, అధికార పార్టీ సభ్యులు సార్ సార్ అంటుండగా.. 'వదిలేయండి.. చైర్‌ను ఇంకా అవమానించాలనుకుంటే కరెక్టు కాదు' అని మోషేన్‌రాజు అన్నారు. మీరంటే మాకు అపారమైన గౌరవం ఉందంటూ మంత్రులు అచ్చెన్నాయు డు, మనోహర్, బాలవీరాంజనేయస్వామి, పలువురు టీడీపీ సభ్యులు అన్నారు. వారు చైర్మన్ సీటును అగౌరవపరిచారని వైసీపీ సభ్యులు వ్యాఖ్యానించారు. చైర్మన్ జోక్యం చేసుకుని.. 'జరిగింది నాకు.. మీకు సంబంధం లేదు కదా' అని వారినుద్దేశించి అన్నారు.

వాళ్లే భయపడుతున్నారు: అచ్చెన్న

చైర్మన్ అంటే తమకు అపారమైన గౌరవమని అచ్చెన్నాయుడు చెప్పారు. 'పార్లమెంటరీ సంప్రదాయాల ప్రకారం ప్రతిపక్షం ఒక సబ్జెక్టు మీద చర్చించాలంటే నోటీసివ్వాలి. నోటీసివ్వకపోయినా బీఏసీలో అంగీకరించాం కాబట్టి మేమే ఒక అడుగు ముందుకొచ్చి నిన్న

2లో

## మండలిలో 'లడ్డూ చర్చ'పై వాదోపవాదాలు

చర్చించడానికి కాపీలన్నీ సిద్ధం చేసి,మండలిలో పెట్టాం. ముందు రోజు అసెంబ్లీలో ప్రతిపక్షం లేకపోయినా కూడా.. మా సభ్యుడు నరేంద్రతో నోటీసు ఇప్పించి, కాపీలన్నీ సభలో పెట్టి, సంబంధిత మంత్రి దానిని చదివిన తర్వాత చర్చ సాగింది' అని తెలిపారు. 'అది అసెంబ్లీలో అవ్వొచ్చు.. ఇక్కడ (మండలిలో) ప్రొసీడింగ్స్ వేరు' అని చైర్మన్ అన్నారు. తాము చెప్పేది విన్న తర్వాత ఆయన మాట్లాడాలని అచ్చెన్న కోరారు. 'మండలి లో వైసీపీ వాళ్లు నోటీసివ్వకపోయినా మీ దగ్గర బీఏసీలో అంగీకరించాం కాబట్టి.. మీ మాటను గౌరవించాలి కాబట్టే.. వాళ్లకు ఆసక్తి లేకపోయినా మేం బాధ్యత కలిగిన ప్రభుత్వంగా కాపీలన్నీ ఇక్కడ పెట్టి మా మంత్రి చదువుతారని చెబితే.. ఆయన ప్రసంగించకుండా అడ్డుకోవడం మీరే చూశారు. దానిపైనే సభా వ్యవహారాల మంత్రి పయ్యావుల మాట్లాడుతుంటే.. వాస్తవాలు బయటకు వస్తాయని వాళ్లు భయపడ్డారు. మేం వెనకడుగు వేయం. తిరుపతి లడ్డూపై చర్చించడానికి సిద్ధంగా ఉన్నాం. ఒకరోజు చాలకపోతే 4, 5, 6 తేదీల్లో మూడు రోజులూ చర్చించడానికి సిద్ధం' అని స్పష్టం చేశారు.

అర్ధాంతరంగా ముగిసిన సమావేశం

అనంతరం.. లడ్డూప్రసాదంపై వైసీపీ సభ్యులు రమేశ్ యాదవ్, భరత్, సుబ్రహ్మణ్యం ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని తిరస్కరిస్తున్నట్లు చైర్మన్ ప్రకటించారు. ప్రశ్నోత్తరాలు చేపట్టారు. అయితే లడ్డూ అంశంపై చర్చ జరపాలని వారు పట్టుబట్టారు. మంత్రి నాదెండ్ల మనోహర్ సభ్యుల ప్రశ్నకు సమాధానం ఇస్తుండగా.. వైసీపీ ఎమ్మెల్సీలు చైర్మన్ పోడియాన్ని చుట్టుముట్టారు. లడ్డూ అం శంపై చర్చ జరపాలని ప్లకార్డులు పట్టుకుని, నినాదాలు చేశారు. దీంతో టీడీపీ సభ్యులు కూడా పోడియం వద్దకు వెళ్లి సభను ఆర్డర్ లో పెట్టాలని చైర్మన్‌ను కోరారు. అయితే ప్రశ్నోత్తరాలను సాగనివ్వకుండా వైసీపీ సభ్యులు గందరగోళం సృష్టించారు. దీంతో చైర్మన్ సభను కొద్దిసేపు వాయిదా వేశారు. అనంతరం మంత్రులు చైర్మన్ చాంబర్‌కు వెళ్లారు. ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని కోరారు.

## ఏయూను వైసీపీ కార్యాలయంగా మార్చారు



క్రైం కౌంటర్ న్యూస్, అమరావతి, ఫిబ్రవరి 27 గత వైసీపీ ప్రభుత్వంలో ఆంధ్రా యూనివర్సిటీని వైసీపీ కార్యాలయంగా మార్చేశారని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ష?ట్రనిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆరోపించారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో విశాఖ సిటీ ఎమ్మెల్యేలు రామకృష్ణబాబు, గణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆంధ్రా యూనివర్సిటీలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలపై చర్యలు చేపట్టాలని, వర్సిటీలోని వసతి గృహాలు, విభాగాల్లో పనిచేస్తున్న రోజువారీ వేతన సిబ్బంది, ఎన్ఎంఆర్, 28 రోజుల వేతన ఉద్యోగులను కనీస వేతన శ్రేణి ఉద్యోగులుగా(ఎంటీఎస్) పరిగణించడం, దీర్ఘకాలంగా పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి లోకేశ్ స్పందిస్తూ విశ్వవిద్యాలయాల్లో గత ఐదేళ్లలో వైసీపీ కార్యకర్తలను విచ్చలవిడిగా వివిధ పోస్టుల్లో నియమించుకున్నారని, దానిపై ఇప్పుడు ప్రత్యేకంగా మేన్‌పవర్ ఆడిట్ నిర్వహిస్తున్నామన్నారు. ఆడిట్ పూర్తిచేసి అనర్హులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాంట్రాక్టు, ఎంటీఎస్ సిబ్బంది రెగ్యులరైజ్‌పై ఆడిట్ నివేదిక వచ్చాక ఫైనాన్స్‌తో సంప్రదించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. మాజీ వీసీ ప్రసాదరెడ్డి అవకతవకలపై విచారణ జరుగుతోందని, ఆ నివేదిక 45 రోజుల్లో వస్తుందని, నివేదిక వచ్చాక చర్యలు తీసుకుంటామని లోకేశ్ చెప్పారు. ఆంధ్రావర్సిటీ ఎన్ఐఆర్ఎ?ఫ ర్యాంకింగ్‌లో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 41వ ర్యాంకుకు తెచ్చామని, ఇప్పుడు టాప్-10లోకి తేవాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. శనివారం విశాఖ పర్యటనలో వీసీని కలిసి వందేళ్ల ఉత్సవాల నిర్వహణపై చర్చిస్తానన్నారు. మనమిత్ర ద్వారా 943 సేవలు అందిస్తున్నామని, ఇప్పటివరకు 1.48 కోట్ల సేవలు అందించామని లోకేశ్ తెలిపారు. మనమిత్ర వాట్సాప్ సేవలపై శాసనసభలో ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ మనమిత్ర ఫ్లాట్‌ఫాంపై ఎలాంటి డేటా స్టోర్ చేయడం లేదన్నారు. మనమిత్ర యాప్‌ను యూజర్ ఫ్రెండ్లీగా తీర్చిదిద్దుతామని చెప్పారు.

## తిరుపతిలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ: నారాయణ



క్రైం కౌంటర్ న్యూస్, అమరావతి, ఫిబ్రవరి 27 కేంద్ర ప్రభుత్వ సహకారంతో తిరుపతిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టే యోచన చేస్తామని మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ తెలిపారు. తిరుపతిలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుపై ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ తిరుపతిలో 408.4 కిలోమీటర్ల పరిధిలో యూజీడీ అవసరముందన్నారు. పాత వాటిలో 7.5 కిలోమీటర్లు లైన్ మార్చేందుకు మార్చిలో టెండర్లు పిలుస్తున్నామన్నారు. మిగతా ప్రాంతంలో యూజీడీ కోసం నిధులపై కేంద్రంతో సంప్రదించి ముందుకెళ్తున్నామన్నారు. స్వచ్ఛ ఆంధ్ర సాధించాలంటే అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పూర్తి చేయాలన్నారు. తుని పట్టణంలోనూ అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టాలని ఎమ్మెల్యే యనమల దివ్య కోరారు.

# ఫోరం ఫర్ అర్.టీ.ఐ. క్యాలెండర్ ని ఆవిష్కరించిన ఆంధ్రప్రదేశ్ లోకాయుక్తా రిజిష్టర్ టీ.వెంకటేశ్వరరెడ్డి





కర్నూలు జిల్లా కర్నూలు:::: క్రైం కౌంటర్ న్యూస్ ప్రతినిధి:::: ఫోరం ఫర్ అర్.టీ.ఐ. క్యాలెండర్ ని ఆవిష్కరించిన ఆంధ్రప్రదేశ్ లోకాయుక్తా రిజిష్టర్ టీ.వెంకటేశ్వరరెడ్డి ఫోరం ఫర్ అర్.టీ.ఐ. 2026వ సంవత్సరం క్యాలెండర్ బి.బి.వి.నరసింహారావు కర్నూలు లోని లోకాయుక్త కార్యాలయం లో ఈ రోజున లోకాయుక్తా రిజిస్టర్ టీ.వెంకటేశ్వరరెడ్డిని మర్యాద పూర్వకంగా కలసి ఫోరం ఫర్ అర్.టీ.ఐ. 2026వ సంవత్సరం క్యాలెండర్ ని ఆవిష్కరించాలని కొరగా లోకాయుక్తా రిజిస్టర్ టీ.వెంకటేశ్వరరెడ్డి (ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ మరియు షేషన్ జడ్జ్)రిజిస్ట్రారు 2026వ సంవత్సరం ఫోరం ఫర్ అర్.టీ.ఐ. క్యాలెండర్ ని ఆవిష్కరించారు. నీతి,న్యాయం కోసం ప్రభుత్వం ద్వారా సమాచార హక్కు చట్టంతో ప్రజాసమస్యలు ని ప్రభుత్వానికి,అధికారులకు చేరవేస్తూ,ప్రభుత్వ పధకాలు ని ప్రజలకు చేరవేస్తూ సమస్యలు ని పరిష్కరించటానికి ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని,ఫోరం ఫర్ అర్.టీ.ఐ. క్యాలెండర్ ని ఆవిష్కరించటం ఆనందము గా ఉందని,ఫోరం ఫర్ ఆర్.టీ.ఐ.జాతీయ.గౌరవాధ్యక్షుడు పత్తిపాటి చంద్రమోహన్,జాతీయ అధ్యక్షులు మట్టా ప్రసాద్, బి.బి.వి.నరసింహారావు,ఉపాధ్యక్షులు నడా విక్టర్ పాల్ లకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియచేసి పేద ప్రజలకు,ప్రభుత్వానికి,రధ సారధిగా,నీతి, న్యాయంగా,అవగాహనాలు కల్పిస్తూ జాతీయ స్టాయిలో మరింత మెరుగైన మంచి గుర్తిపుని తీసుకు వస్తారని ఆశాభావాన్ని వ్యక్తపరిచారు.లోకాయుక్త ఆసిస్టెంట్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారి అర్.వి.భాస్కరరావు,డిప్యూటీ రిజిష్టర్ మరియు పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారి ఏం.ఉషారాణి, సెక్షన్ అధికారి పీ.లలిత వారి వారి కార్యాలయం లోని చాంబర్స్ లలో ఫోరం ఫర్ అర్.టీ.ఐ. క్యాలెండర్స్ ని ఆవిష్కరించారు. ఫోరం ఫర్ అర్.టీ.ఐ. జాతీయ కార్యదర్శి బి.బి.వి. నరసింహారావులోకాయుక్త రిజిష్టర్ టీ.వెంకటేశ్వరరెడ్డిని,అసిస్టెంట్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ ఆర్ .వి భాస్కరరావులను దుస్సాలువాలతో ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమం లో లోకాయుక్తా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

# మేము సైతం టీం ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు అందించిన కోటప్రోలు కృష్ణ బి.జే.పీ.పార్టీ

ఏలూరు జిల్లా ముదినేపల్లి::::క్రైం కౌంటర్ న్యూస్ ప్రతినిధి:::: మేము సైతం టీం ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు అందించిన కోటప్రోలు కృష్ణ బి.జే.పీ.పార్టీ ఏలూరు జిల్లా మన్ కి బాత్ జిల్లా కార్యదర్శి, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణ గురజ గ్రామ నివాసి గొంతుపులి వంశీ మంచంలో ఉండుట చేత కుటుంబ పోషణ భారమై నిరుపేద కుటుంబానికి చెందిన వంశీకి ఇద్దరు మగ పిల్లలు, ఒకరికి నాలుగు సంవత్సరాలు, కాగా మరొ బాబుకి మూడు నెలలు కాగా చిన్న పిల్లలుతో పనులకు వెళ్లలేక,భర్త బాగోగులు చూస్తూ రోజులు గడుపుతున్న వంశీ కుటుంబానికి బాసటగా నిలబడి,తెలియ చేసిన వివరాల ప్రకారం గత ఏడాది ఆగస్టు నెల 17వ తారీఖున కావలిలో ట్రైన్ లో వస్తూ ఉన్న సమయంలో ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోవడంతో తలపై బలమైన గాయం కాగా అక్కడ ఉన్న స్ధానిక పోలీస్ స్టేషన్ అధికార సిబ్బంది గవర్నమెంట్ హాస్పిటల్ నందు ట్రీట్మెంట్ కి చేర్చగా అతని తలకి బలమైన గాయం తగలడంతోను వెన్నుపూస పై భారం పడి వెన్ను పూస సమీపములోని నరం కట్టవడంతో భాదితుడు పూర్తిగా మంచాన్న బారిన పడ్డాడని, ఈ విషయం తెలుసుకున్న మేము సైతం మీకోసం మేమున్నాం టీం వెంటనే కోటప్రోలు కృష్ణ దగ్గరికి తీసుకు వెళ్ళగా





ఆయన మానవతా దృక్పధంతో తన వంతు సహాయముగా ఒక నెల రోజులు సరుకులు అందిశీచారు అంతేకాకుండా ఈ భాదితుడికి ప్రభుత్వం తరపున ఇచ్చేటువంటి పెన్షన్ వచ్చేలా అధికారులతో మాట్లాడి పెన్షన్ కూడా వచ్చేలా ఏర్పాటు చేస్తానని కోటప్రోలు కృష్ణ హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో కోటప్రొలు కృష్ణ , మొవ్వ ఫణింద్ర, కోటేశ్వరరావు, అను, ఫణి, మేము సైతం టీమ్ సభ్యులు పాల్గొన్నారు

# సూచనలు.. హెచ్చరికలు

**నివేదికల ఆధారంగా ప్రతి అంశంపై విశ్లేషణ**

**నేతలు, అధికారులతో సీఎం చంద్రబాబు సమావేశం**

**పొద్దుపోయే వరకూ కొనసాగిన సమీక్ష**



క్రైం కౌంటర్ న్యూస్, ఉమ్మడి జిల్లాలో పరిస్థితులపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లోతైన విశ్లేషణ చేశారు. అనేక వ్యవహారాలపై తనకున్న సమాచారం, నివేదికలకు అనుగుణంగా సూచనలు, హెచ్చరికలు చేసినట్లు తెలుస్తోంది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా శుక్రవారం రాత్రి ఉమ్మడి జిల్లాలోని మంత్రులు గొట్టిపాటి, స్వామి, ఎంపీ మాగుంట, ఆరుగురు ఎమ్మెల్యేలు, రెండు నియోజకవర్గాల టీడీపీ ఇన్‌చార్జులతో సీఎం సమావేశమయ్యారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనంతోపాటు కలెక్టర్, ఎస్పీ కూడా పాల్గొన్నారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం 7.30కు మొదలైంది. రెండు గంటల అనంతరం 9.45కు విరామం ఇచ్చి తిరిగి 10గంటల తర్వాత సమావేశాన్ని ప్రారంభించారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో జరుగుతున్న సంక్షేమ కార్యక్రమాలను సమీక్షించారు. కొన్నింటి అమలులో లోపం ఉన్నట్లు, ఆ విషయంలో అధికారుల వైఫల్యాలతోపాటు ఎమ్మెల్యేల్లో అప్రమత్తంగా లేనివారిని ప్రత్యేకంగా ప్రస్తావించినట్లు తెలిసింది. అభివృద్ధి కార్యక్రమాల అమలుపైనా సీఎం మాట్లాడుతూ ఎన్నికలకు ముందు తాను, లోకేష్ జిల్లాకు వచ్చినప్పుడు ఇచ్చిన హామీల అమలుకు ప్రత్యేక చొరవ తీసుకున్న విషయాన్ని వివరించారు. అదేతరహాలో మీరు స్థానికంగా ఇచ్చిన హామీల అమలుకు ఎంతమేర చిత్తశుద్ధితో పనిచేశారో సమీక్ష చేసుకోవాలని సూచించారు. జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు.. ప్రజాప్రతిని?ధులు, అధికారుల మధ్య సమన్వయం బాగుందని చెప్పారు. ఇదేసమయంలో ప్రజల్లోకెళ్లడంలో కొంతమంది అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా ఉన్నారన్నారు. వారి ప్రజాసంబంధాల శాతం తక్కువగా ఉందని స్పష్టంగా చెప్పినట్లు తెలుస్తోంది. ఇసుక రవాణా విషయంలో కొందరి జోక్యాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ ఇకపై ఉపేక్షించనని హెచ్చరించినట్లు తెలిసింది. ప్రజాసంబంధాల విషయంలో టాప్-10లో కొందరు, మధ్యస్తంగా మరికొందరు మొత్తంగా ఎక్కువమంది ఎమ్మెల్యేలు ముందువరసలో ఉన్నారన్నారు. అలాగే ఒకరిద్దరు వెనుకబడి ఉన్నారని చెబుతూ హెచ్చరికలు చేసినట్లు సమాచారం. మంత్రులు గొట్టిపాటి, డోలా పనితీరును కొనియాడారు. దర్శి, వైపాలెం నియోజకవర్గాల్లో పరిస్థితులపై ఆయన ప్రత్యేకంగా సమీక్షించినట్లు తెలిసింది. అయితే సమావేశం నిర్వహణకు సంబంధించి అధికారికంగా ఫొటోలు కూడా బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవడం విశేషం.

# సిట్' విచారణను మేమే పర్యవేక్షిస్తాం

## చిత్తశుద్ధితో విచారిస్తుందని ఆశిస్తున్నాం
## గ్రూప్-1 మూల్యాంకనం కేసుపై హైకోర్టు



క్రైం కౌంటర్ న్యూస్, అమరావతి, ఫిబ్రవరి 27 గ్రూప్-1 జవాబుపత్రాల మూల్యాంకనంలో అక్రమాలకు సంబంధించి వాస్తవాలను తేల్చేందుకు తమ ఆదేశాలతో ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) పారదర్శకత, చిత్తశుద్ధితో విచారిస్తుందని ఆశిస్తున్నట్టు హైకోర్టు వ్యాఖ్యానించింది. ఈ మొత్తం వ్యవహారం కొలిక్కి వచ్చే వరకు సిట్ విచారణను తామే పర్యవేక్షిస్తామని స్పష్టం చేసింది. జవాబుపత్రాల మూల్యాంకనంలో అక్రమాలను నిర్ధారిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై దాఖలైన పిటిషన్ల విచారణకు ఇప్పటికే ఎక్కువ సమయం కేటాయించామని గుర్తుచేసింది. ఈ నేపథ్యంలో ఈ పిటిషన్లకు తార్కిక ముగింపు ఇచ్చేవరకు వాటిని తమవద్దే ఉంచుకొని విచారణ జరుపుతామని పేర్కొంది. తదుపరి విచారణను మార్చి 16కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథశర్మతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చింది. గ్రూప్-1 ప్రధాన పరీక్షలో అక్రమాలను నిర్ధారిస్తూ సింగిల్ జడ్జి గతంలో తీర్పు ఇచ్చారు. అయితే ఈ తీర్పును సవాల్ చేస్తూ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో పాటు ఎంపికకాని మరికొందరు అప్పీల్ చేశారు. వీటిపై తుది విచారణ జరుపుతున్న ధర్మాసనం జవాబుపత్రాల మూల్యాంకనంలో అక్రమాల ఆరోపణలు తేల్చేందుకు సిట్ ఏర్పాటు చేసింది. అలాగే, అప్పట్లో ఉద్యోగాలకు ఎంపికై ప్రస్తుతం సర్వీసులో ఉన్న వారిని అప్రాధాన్య పోస్టులకు బదిలీ చేయాలని ఆదేశించింది. దీనికిగాను ఈ నెల 25న జరిగిన విచారణలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ హైకోర్టును సమయం కోరారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మరోసారి పిటిషన్లపై విచారణ జరిగింది. సీఎస్ తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎ?సజీపీ) ఎస్.ప్రణతి వాదనలు వినిపిస్తూ.. కోర్టు ఉత్తర్వులను అమలు చేశామని తెలిపారు. వివరాలతో మెమో దాఖలు చేశామని పేర్కొన్నారు. ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. తమ ఆదేశాలకు అనుగుణంగా సిట్ ఏర్పాటు అయ్యిందా? విచారణ జరుగుతోందా? అని ప్రశ్నించింది. ఎస్‌జీపీ బదులిస్తూ.. సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ నేతృత్వంలో సిట్ ఏర్పాటు అయిందని బదులిచ్చారు.

### కోర్టుధిక్కరణ కేసులో నోటీసులు

గ్రూప్-1లో ఎంపికై ఉద్యోగాలు చేస్తున్న అభ్యర్థులను తక్షణం అప్రాధాన్య పోస్టులకు బదిలీ చేయాలంటూ 11న హైకోర్టు ధర్మాసనం ఇచ్చిన ఉత్తర్వులను సీఎస్ విజయానంద్, సాధారణ పరిపాలనశాఖ ముఖ్యకార్యదర్శి శ్యామలరావు అమలు చేయలేదని పేర్కొంటూ గొర్ల సుజాత అనే అభ్యర్థి కోర్టుధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరిపిన ధర్మాసనం.. విజయానంద్, శ్యామలరావుకు నోటీసులు జారీ చేసింది. కౌంటర్ వేయాలని ఆదేశిస్తూ విచారణను 16కు వాయిదా వేసింది.

# వివేకా హత్య కేసులో మళ్లీ సీబీఐ విచారణ

క్రైం కౌంటర్ న్యూస్, కడప, ఫిబ్రవరి 27 సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో సీబీఐ విచారణ రెండేళ్ల తర్వాత మళ్లీ మొదలైంది. సుప్రీంకోర్టు సూచన మేరకు వివేకా హత్య కేసులో ఏ2గా ఉన్న సునీల్‌యాదవ్ సోదరుడు కిరణ్‌కుమార్ యాదవ్, అర్జున్‌రెడ్డి మధ్య జరిగిన కాల్ డేటాపై సీబీఐ విచారణ చేపట్టింది. శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటలకు పులివెందుల అర్బన్ పోల?సస్టేషన్‌కు సీబీఐ అధికారి రోహిత్‌యాదవ్ వచ్చారు. సునీల్‌యాదవ్ తమ్ముడు కిరణ్‌యాదవ్‌ను సీబీఐ విచారణకు పిలిచింది. ఈ కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరిని ప్రభావితం చేసేందుకు ప్రయత్నించిన భరత్‌యాదవ్ తమ్ముడు మహేంద్రకుమార్ యాదవ్‌ను, అర్జున్‌రెడ్డిలను కూడా విచారణకు పిలిచింది. ముందుగా మహేంద్రకుమార్ యాదవ్‌ను సీబీఐ అధికారి గంటన్నర పాటు విచారించారు. కిరణ్ యాదవ్, మహేంద్రయాదవ్ మధ్య జరిగిన ఫోన్ సంభాషణలపై ప్రశ్నించినట్లు తెలిసింది. సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో కిరణ్‌యాదవ్.. సునీల్‌యాదవ్‌తో కలిసి పోల?సస్టేషన్‌కు వచ్చాడు. కిరణ్ యాదవ్, అర్జున్‌రెడ్డి మధ్య జరిగిన ఫోన్ సంభాషణల ఆధారంగా ప్రశ్నించినట్లు తెలిసింది. వివేకా హత్య విషయం ఉదయం 6.15 గంటల ప్రాంతంలో బాహ్య ప్రపంచానికి తెలిసింది. కానీ కిరణ్‌యాదవ్ ఫోన్ నుంచి తన సోదరుడి స్నేహితుడు అర్జున్‌రెడ్డికి వాట్సాప్ మెసేజ్ ద్వారా అర్ధరాత్రి 1.40 గంటలకే వెళ్లినట్లు సీబీఐ అధికారులు గుర్తించారు. ఇదే విషయంపై సీబీఐ అధికారి ప్రశ్నించినట్లు తెలిసింది. ఈ నెల 20న కిరణ్‌యాదవ్, అర్జున్‌రెడ్డిలను హైదరాబాద్‌లో విచారించారు. సీబీఐ అధికారి ఎదుట విచారణ అనంతరం మహేంద్ర యాదవ్ విలేకరులతో మాట్లాడాడు. కిరణ్‌యాదవ్‌కు ఎందుకు ఫోన్ చేశావని సీబీఐ అధికారి ప్రశ్నించారని తెలిపాడు. వివేకా హత్య జరగకముందు నుంచి కూడా తాము ఫోన్‌లో మాట్లాడేవారమని, తామంతా బంధువులమని చెప్పాడు. అనంతరం కిరణ్‌యాదవ్ విలేకరులతో మాట్లాడాడు. అర్జున్‌రెడ్డి, తనకు మధ్య జరిగిన ఫోన్ సంభాషణల గురించి సీబీఐ అధికారి అడిగారని, ప్రశ్నలకు సమాధానమిచ్చానని అన్నాడు. ఈ కేసు విచారణ పూర్తి స్థాయిలో జరిగి, న్యాయం జరగాలంటే తాము ప్రాణాలతో ఉండాలన్నారు. అంతకుమించి ఏమీ చెప్పలేమని, కోర్టులో ఉన్న అంశమని అన్నాడు. శనివారం కూడా సీబీఐ పలువురిని విచారించే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

# అడవులు అగ్గిపాలు



క్రైం కౌంటర్ న్యూస్ మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 27 వేసవి వచ్చిందంటే చాలు అడవులకు నిప్పు అంటుకుంటోంది. ఆకతాయిల చేష్టలు, ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని వేల హెక్టార్ల అడవులు దగ్ధమవుతున్నాయి. పచ్చనిచెట్లతోపాటు వేలాది జీవరాశులు ఆహుతి అవుతున్నాయి. జిల్లాలో మదనపల్లె, పుంగనూరు, పీలేరు, రాయచోటి ఫారెస్ట్ రేంజిలు ఉన్నాయి. వీటిలో 3.33లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో అడవులు ఉన్నాయి. ఎక్కువ భాగం మదనపల్లె, పీలేరు రేంజిలలో 2.78లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్నాయి. ఇందులో వేప, సంద్ర, పొడి ఆకులు రాల్చే చెట్లు, ముళ్ల పొదలు ఎక్కువగా ఉన్నాయి. చిరుతలు, ఎలుగుబంట్లు, నక్కలు, తోడేళ్లు, కృష్ణజింకలు, కణితులు, అడవి పందులు, నెమళ్లు, వేలాది పక్షి జాతులు, సరీసృపాలైన పాములు, తొండలు, కుందేళ్లు లాంటి వన్యప్రాణులు జీవిస్తున్నాయి. వీటికితోడు ఆయుర్వేదం, హోమియోపతి వైద్య చికిత్సలకు అమూల్యమైన వనమూలికలు కూడా ఉన్నాయి.

### అడవుల సంరక్షణకు ఫైర్‌వాల్స్

వేసవిలో అడవులు అగ్నికి అహుతి కాకుండా అటవీశాఖ ఆధ్వర్యంలో ఫైర్‌వాల్స్, డిజిటల్ ఫైర్‌వాల్స్, వనసంరక్షకులను ఏర్పాటు చేస్తారు. ఏటవాలు అడవుల్లో కొండల పై నుంచి కింది వరకు 30 మీటర్ల వెడల్పుతో కేవలం రాళ్లు మాత్రం ఉండేలా ఖాళీ స్థలం ఏర్పాటు చేస్తారు. దీనివల్ల ఒకవేళ అడవుల్లో మంటలు పుట్టినా విస్తరించకుండా ఈ ఫైర్‌వాల్స్ అడ్డుకుంటాయి. ఏటా జనవరి, ఫిబ్రవరి నెలల్లో ఫైర్‌వాల్స్ క్లీనింగ్, కొత్తవి ఏర్పాటు చేయడం ఆనవాయితీ. దీనికోసం రేంజిల విస్తీర్ణం బట్టి ప్రభుత్వం ఏటా రూ.30 నుంచి రూ.40 లక్షల నిధులు విడుదల చేస్తుంది. ఇందులో కాంపా నిధుల కింద కేంద్ర ప్రభుత్వం 60శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40శాతం నిధులు భరిస్తాయి. జిల్లాకు వన సంరక్షణ కింద ఏడాదికి రూ.కోటి దాకా నిధులు మంజూరు కావల్సి ఉంది. ఇందులో ఫైర్‌వాల్స్ ఏర్పాటు, క్లీనింగ్ చేసే కూలీలకు, వన సంరక్షకులకు నెల వేతనాలు, అడవుల్లో నీటి నిల్వల ఉండేలా చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలు చేయడం, ఫైర్ బ్లోయర్స్, పరికరాలు కొనుగోలుకు వినియోగించాల్సి ఉంది. కానీ ఈ నిధులు విడుదలయ్యాయో లేదో తెలియని దయనీయ పరిస్థితి అటవీశాఖలో నెలకొనివుంది.

### డిజిటల్ ఫైర్ వాల్స్‌కు

సాంకేతికతను ఆధారం చేసుకుని డిజిటల్ ఫైర్‌వాల్స్/లైన్స్ ఏర్పాటు చేస్తారు. ఎఫ్ఎ?సఐ(ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా) వివరాలతో అడవుల్లో ఎక్కడైనా నిప్పుపుట్టి పొగలు వస్తే శాటిలైట్ ద్వారా గుర్తించి ఆయా ఫారెస్ట్ రేంజర్ల మొబైల్ ఫోన్లకు మెసేజ్ వెళ్తుంది. వెంటనే ఎఫ్ఆర్‌వో కింది స్థాయి సిబ్బందిని అప్రమత్తం చేసి మంటలను అదుపులోకి తెస్తారు. దుర్భేధ్యమైన అడవుల్లో డ్రోన్ల సహాయంతో అడవుల్లో మంటలను గుర్తించి, పలు మార్గాల ద్వారా మంటలను ఆర్పుతారు. ఇటీవల నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్(ఎన్‌డీఎం) నుంచి ప్రజల మొబైల్‌ఫోన్లకు అప్రమత్త మెసేజ్‌లు వస్తున్నాయి.

### క్షేత్రస్థాయిలో అమలులో కష్టాలు

ప్రస్తుతం జిల్లాలో ఎక్కడ చూసినా అడవులు తగలబడిపోతున్నాయి. ఆకతాయిలు నిప్పుపెట్టడం, గొర్రెల కాపర్లు, కొత్త బోధ కోసం బోధగడ్డికి నిప్పుపెట్టడం వలన అడవులు దగ్ధమవుతున్నాయి. సకాలంలో సంఘటనా స్థలానికి వెళ్లి ప్రజల సహకారంతో మంటలను ఆర్పడం అటవీశాఖ సిబ్బందికి కష్టమవుతోంది. గత ఏడాది ములకలచెరువు మండలంలో ఓ అడవిలో మేతకు వెళ్లిన 100 గొర్రెలు మంటలకు బలైపోయాయి. తాజాగా మదనపల్లె రేంజి పరిధిలోని నూరుకుప్పలకొండ, బొమ్మకొండ, బసినికొండ, తంబళ్లపల్లె మల్లయ్యకొండ అడవులకు నిప్పు అంటుకుని భారీ నష్టం వచ్చింది. వేల సంఖ్యలో వన్యప్రాణులు, సరీసృపాలు మరణించాయి. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తం అయ్యి మంటలను ఆర్పడంలో సఫలీకృతులయ్యారు.

# ముందుగానే 'పది' పాఠాలు

**9వ తరగతికి మార్చిలోనే ఎస్ఏ-2 పరీక్షలు**
**ఆ వెంటనే పదో తరగతి సిలబస్ ప్రారంభం**
**ప్రతి సబ్జెక్టులో నాలుగు చాప్టర్ల బోధన**
**విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యం పెరిగి, పరీక్షల్లో ఉత్తమ ఫలితాలకు అవకాశం**
**ప్రభుత్వ పాఠశాలల్లో తొలిసారిగా బ్రిడ్జి విధానం**



క్రైం కౌంటర్ న్యూస్, అమరావతి, ఫిబ్రవరి 27పాఠశాల విద్యాశాఖ ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్ తరహా బోధనకు శ్రీకారం చుడుతోంది. వచ్చే ఏడాది చదవాల్సిన పాఠాలను విద్యార్థులకు ఇప్పుడే బోధించాలని నిర్ణయించింది. ప్రస్తుతం ప్రైవేటు పాఠశాలల్లో 9వ తరగతి విద్యార్థులకు ముందుగానే పదో తరగతి సిలబస్ ప్రారంభిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరంలోనే కొంత సిలబ్‌స్‌ను పూర్తి చేయడం వల్ల.. వచ్చే విద్యా సంవత్సరంలో మిగిలిన సమయాన్ని మరింత సమర్థవంతంగా ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ కూడా ఈ విద్యా సంవత్సరం నుంచి మొట్టమొదటి సారిగా ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఈ విధానం ప్రవేశపెడుతోంది. అందుకోసం తొమ్మిదో తరగతి విద్యార్థులకు సమ్మేటివ్ అసట?సమెంట్-2 (తుది పరీక్షలు)ను నెల రోజులు ముందుకు తీసుకొచ్చింది. ఉన్నత పాఠశాలల్లో 6-8 తరగతుల విద్యార్థులకు ఎస్ఏ-2 పరీక్షలు ఏప్రిల్ 6 నుంచి 15 వరకు జరుగుతాయి. ప్రతి ఏటా 9వ తరగతి పరీక్షలు కూడా వీరితో కలిపి జరిగేవి. కానీ ఈ ఏడాది టెన్త్ సిలబ్‌స‌ను ముందే ప్రారంభించాలని నిర్ణయించిన అధికారులు.. తొమ్మిదో తరగతి విద్యార్థులకు మార్చి 12తోనే ఎస్ఏ-2 పరీక్షలను పూర్తిచేయనున్నారు. ఆ తర్వాత ఏప్రిల్ 23 వరకు పాఠశాలల పనిదినాలు ఉంటాయి. ఈ 40 రోజుల్లో వారికి పదో తరగతి సిలబ్‌స‌ను బోధిస్తారు. ప్రతి సబ్జెక్టులో నాలుగు చాప్టర్ల చొప్పున పాఠ్యాంశాలు పూర్తి చేస్తారు. అందులో క్లిష్టంగా ఉండే పాఠ్యాంశాలకు ప్రాధాన్యత ఇస్తారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు వాటిని చదువుకునేలా ఈ బోధన జరుగుతుంది. అనంతరం 2026-27 విద్యా సంవత్సరం ప్రారంభమయ్యాక మిగిలిన పాఠ్యాంశాల బోధన ప్రారంభమవుతుంది. దీనివల్ల వచ్చే విద్యా సంవత్సరంలో టెన్త్ సిలబస్ చాలా ముందుగానే పూర్తవుతుంది. మిగిలిన సమయాన్ని పబ్లిక్ పరీక్షల సన్నద్ధతకు ఉపయోగిస్తారు. ఎక్కువ సమయం ఉండటం వల్ల విద్యార్థుల అభ్యసన సామర్థ్యం పెరిగి, ఉత్తమ ఫలితాలు వస్తాయని పాఠశాల విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు. ఇంటర్మీడియట్‌లో ఈ తరహా బ్రిడ్జి కోర్సుల విధానం ఉంది. పాఠశాల నుంచి ఇంటర్‌కు వెళ్లే విద్యార్థులు అయోమయానికి గురికాకుండా జూనియర్ కాలేజీలూ బ్రిడ్జి కోర్సులు నిర్వహిస్తుంటాయి. ఇప్పుడు పాఠశాల విద్యా శాఖ కూడా అలాంటి బ్రిడ్జి విధానం తీసుకొస్తోంది.

# హథీరాంజీ మఠానికికొత్త మహంత్‌ను నియమించొద్దు!




క్రైం కౌంటర్ న్యూస్, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27 తిరుపతిలోని శ్రీ స్వామి హథీరాంజీ మఠం మఠాధిపతి (మహంత్) పదవి నుంచి అర్జున్‌ద?సను తొలగిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ధార్మిక పరిషత్ తీసుకున్న నిర్ణయంపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ పూర్తయ్యే వరకు ఆయన స్థానంలో కొత్త మఠాధిపతిని నియమించవద్దని స్పష్టంచేసింది. అలాగే మఠానికి చెందిన ఆస్తులను విక్రయించడం లేదా అన్యాక్రాంతం చేయడంలాంటి చర్యలకు పాల్పడవద్దని ఆదేశించింది. తనను అకారణంగా తొలగించారంటూ అర్జున్ దాస్ దాఖలుచేసిన వ్యాజ్యంపై శుక్రవారం జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ అతుల్ ఎస్.చందూర్కర్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం..తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు కొత్త మఠాధిపతి నియామక ప్రక్రియపై స్టే విధించింది. మఠం ఆస్తులను ప్రస్తుతానికి విక్రయించకూడదని లేదా బదిలీ చేయకూడదని స్పష్టం చేసింది. వివాదం పరిష్కారమయ్యేంత వరకు మఠం ఆస్తులు, ఆదాయ వ్యయాలకు సంబంధించి పక్కాగా ఖాతాలను నిర్వహించాలని ఆదేశించింది. ఈ వ్యవహారంతో పాటు ఆస్తుల నిర్వహణపై అవసరమైతే జ్యుడీషియల్ అధికారుల ద్వారా పూర్తి స్థాయి విచారణ జరిపించే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపింది. తదుపరి విచారణను ఏప్రిల్ మొదటి వారానికి వాయిదా వేసింది.

# సినిమా



## వెంకీ రిజెక్ట్ చేసిన కథతో బాలయ్య సినిమా..

తెలుగు సినిమా ఇండస్ట్రీకి ఉన్న నాలుగు మూల స్తంభాల్లో బాలకృష్ణ, వెంకటేష్ కూడా ఒకరు. సీనియర్ హీరోలు అయినప్పటికీ వీరు ఇప్పటికీ వేగంగా సినిమాలు చేస్తున్నారు. బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకుంటున్నారు. అలా ఈ ఇద్దరు హీరోల ఎన్నో సూపర్ హిట్స్, ఇండస్ట్రీ హిట్స్ ఉన్నాయి. అలాగే ఫ్లాప్ సినిమాలు కూడా ఉన్నాయి. ఇక వివిధ కారణాలతో వీరు కూడా చాలా సినిమాలు రిజెక్ట్ చేశారు. అందులో కొన్ని ఫ్లాప్ సినిమాలు ఉన్నాయి. మరికొన్ని హిట్ మూవీస్ ఉన్నాయి. అలా వెంకటేష్ రిజెక్ట్ చేసిన ఓ సినిమాతో బాలయ్య బ్లాక్ బస్టర్ అందుకున్నాడు. ఏకంగా ఇండస్ట్రీ రికార్డులు బద్దలు కొట్టేశాడు. ఇంతకీ ఆ సినిమా ఏదనుకుంటున్నారా? నందమూరి నటసింహం నటించిన బ్లాక్ బస్టర్ సినిమాల్లో సమర సింహారెడ్డి ఒకటి. బి. గోపాల్ తెరకెక్కించిన ఈ ఫ్యాక్షన్ మూవీ అప్పట్లో ఎలాంటి సెన్సేషన్ సృష్టించిందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇందులోని యాక్షన్ సన్నివేశాలు, డైలాగులు, పాటలు, బాలయ్య యాక్టింగ్.. ఇలా ఎన్నో అంశాలు హైలెట్ గా నిలిచాయి.అయితే ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, సమరసింహా రెడ్డి సినిమాలో హీరో పాత్రకు బాలకృష్ణ మొదటి ఎంపిక కాదట. ఈ కథను మొదట విక్టరీ వెంకటేష్‌కు వినిపించారట దర్శకుడు బీ. గోపాల్. వెంకటేష్ కు కూడా కథ బాగా నచ్చిందట. అయితే ఇందులో ఫ్యాక్షన్ మరీ ఎక్కువగా ఉండడంతో వెంకటేష్ వెనక్కడుగు వేశాడట. ఈ సినిమా స్టోరీ తనకు కథ పూర్తిగా సూట్ అవ్వదని.. ఈ క్యారెక్టర్ కు బాలయ్యే సరైన ఎంపిక అని వెంకీ స్వయంగా దర్శకుడికి చెప్పారట. దీంతో దర్శకుడు నేరుగా బాలకృష్ణ కు చెప్పగా ఆయన వెంటనే ఒకే చెప్పారట. ఇక ఆ తర్వాత సమర సింహారెడ్డి సృష్టించిన చరిత్ర గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఈ సినిమాలో బాలయ్య పవర్ ఫుల్ ఫ్యాక్షనిస్ట్ రోల్‌లో నటించగా, అంజలా జవేరి, సంఘవి, సిమ్రాన్ హీరోయిన్లుగా కనిపించారు. 1999 లో సంక్రాంతి కానుకగా జనవరి 13న విడుదలైన సమరసింహా రెడ్డి బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని నమోదు చేసింది. టాలీవుడ్ లో ఫ్యాక్షన్ సినిమాలకు పునాది వేసింది సమరసింహా రెడ్డి అనే చెప్పుకోవచ్చు.





## ఉదయాన్నే దానిమ్మ జ్యూస్ తాగుతున్నారా?

దానిమ్మ ఒక సూపర్ ఫుడ్ కంటే తక్కువ కాదు. జ్యూసిగా ఉండి ఎర్రటి విత్తనాలతో నిండిన ఈ పండు యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, ఖనిజాల నిధి. అందువల్ల, ఇది ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. కానీ, ప్రతి ఉదయం ఖాళీ కడుపుతో దానిమ్మ రసం తాగడం ప్రారంభిస్తే మీ ఆరోగ్యానికి ఎంత మేలు జరుగుతుందో మీకు తెలుసా? అవును, ప్రతి ఉదయం ఖాళీ కడుపుతో దానిమ్మ రసం తాగడం వల్ల శరీరం పోషకాలను వేగంగా గ్రహించి మీ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఉదయం ఖాళీ కడుపుతో దానిమ్మ రసం తాగడం వల్ల కలిగే ప్రయోజనాలేంటో ఇక్కడ చూద్దాం..

ఉదయం ఖాళీ కడుపుతో ఒక గ్లాస్ దానిమ్మ రసం తాగడం వల్ల జీర్ణవ్యవస్థ ఉత్తేజితమవుతుందని నిపుణులు సూచిస్తున్నారు. ప్రేగులు శుభ్రపడి, టాక్సిన్లు బయటకు వెళ్లి లివర్ పనితీరు మెరుగుపడుతుందంటున్నారు. ఇందులో విటమిన్ , యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండి, ఇన్ఫెక్షన్లను తట్టుకునే శక్తిని పెంచి, వాపులను తగ్గిస్తాయి. ఉదయం ఖాళీ కడుపుతో దానిమ్మ రసం తాగడం వల్ల జీర్ణక్రియ సరిగ్గా పనిచేస్తుంది. పేగు ఆరోగ్యం మెరుగుపడుతుంది. దానిమ్మపండు తినడం వల్ల రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. చెడు కొలెస్ట్రాల్ (ఎల్డీఎల్) తగ్గుతుంది. గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. దానిమ్మలో విటమిన్ సి, ఫోలేట్ పుష్కలంగా ఉంటాయి. ఇది ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి సహాయపడుతుంది. దానిమ్మలో ఉండే మంచి ఫైబర్ కంటెంట్ జీర్ణక్రియను ప్రోత్సహిస్తుంది. మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. చక్కెర కలపని తాజా రసాన్ని ఉదయం 100–150 మి.లీ. తాగిన 20–30 నిమిషాల తర్వాత అల్పాహారం తీసుకోవడం మంచిదంటున్నారు. దానిమ్మ శరీరంలో మంటను తగ్గించడంలో సహాయపడుతుంది. దానిమ్మ మొటిమలను తగ్గించడానికి, చర్మాన్ని ప్రకాశవంతం చేయడానికి, వృద్ధాప్య సంకేతాలను నివారించడానికి సహాయపడుతుంది. దానిమ్మపండు క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధించే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. అధిక రక్తపోటు (బిపి) ఉన్నవారికి దానిమ్మ మంచి పండు.



## పొటాషియం కోసం ఇవి తప్పక తినండి.!

ఇంటర్నెట్ డెస్క్: పొటాషియం మన శరీరానికి చాలా ముఖ్యమైన ఖనిజం. ఇది గుండె స్పందనను సక్రమంగా ఉంచడంలో సాయపడుతుంది. అలాగే కండరాల కదలికలు, నరాల సంకేతాల సరైన పనితీరు కోసం కూడా ఇది అవసరమవుతుంది. ముఖ్యంగా రక్తపోటును నియంత్రించడానికి, శరీరంలో ద్రవ సమతుల్యతను కాపాడుకోవడానికి పొటాషియం కీలక పాత్ర పోషిస్తుంది. దీని గురించి మాట్లాడితే చాలామంది ముందుగా అరటిపండ్లనే గుర్తుకు తెచ్చుకుంటారు. కానీ అరటిపండ్లతో పాటు మరెన్నో ఆహార పదార్థాల్లోనూ పొటాషియం సమృద్ధిగా ఉంటుంది. అలాంటి ఐదు రకాల ఆహార పదార్థాలను గురించి ఇప్పుడు తెలుసుకుందాం..

చిలగడదుంపలు

చిలగడదుంపలు తీపిగా ఉండటమే కాకుండా అనేక పోషకాలను కలిగి ఉంటాయి. 100 గ్రాముల చిలగడదుంపల్లో సుమారు 475 మిల్లీగ్రాముల పొటాషియం ఉంటుంది. అలాగే ఇవి విటమిన్–సీ, విటమిన్–ఏలకు మంచి వనరు.

సోయాబీన్స్

100 గ్రాముల సోయాబీన్స్‌లో సుమారు 18 గ్రాముల ప్రోటీన్, 515 మిల్లీగ్రాముల పొటాషియం ఉంటుంది. అదనంగా కాల్షియం కూడా ఉంటుంది.

పాలు

పాలలో విటమిన్–డి, విటమిన్–బి12 వంటి ముఖ్యమైన పోషకాలు ఉంటాయి. 100 గ్రాముల పాలలో సుమారు 150 మిల్లీగ్రాముల పొటాషియం ఉంటుంది. రోజువారీ ఆహారంలో పాలను చేర్చడం వల్ల పొటాషియం అవసరం కొంతవరకు తీరుతుంది.

నేరేడు పండ్లు

నేరేడు పండ్లు పొటాషియానికి మంచి వనరు. ఇవి కంటి ఆరోగ్యానికి ఉపయోగపడే బీటా కెరోటిన్, లుటిన్, జియాక్సాంతిన్ వంటి పోషకాలను కూడా కలిగి ఉంటాయి.

నారింజ, ద్రాక్ష

నారింజ పండ్లు విటమిన్–సీకి ప్రసిద్ధి. కానీ వీటిలోనూ మంచి మోతాదులో పొటాషియం ఉంటుంది. ఒక చిన్న నారింజలో సుమారు 166 మిల్లీగ్రాముల పొటాషియం ఉంటుంది. అలాగే ద్రాక్షలోనూ పొటాషియం లభిస్తుంది.

పొటాషియం మన శరీరానికి అత్యవసరమైన ఖనిజం. అరటిపండ్లతో పాటు చిలగడదుంపలు, సోయాబీన్స్, పాలు, నేరేడు, నారింజ, ద్రాక్ష వంటి ఆహారాలను మితంగా తీసుకోవడం ద్వారా పొటాషియం అవసరాన్ని తీర్చుకోవచ్చు.

## పుదీనా ఆకుతో కలిగే అద్భుత ప్రయోజనాలు ఇవే..!

పుదీనా పురాతన వంటకాల మూలికలలో ఒకటిగా, జీర్ణక్రియను మెరుగుపరచడంతో పాటు తలనొప్పి, ఉబ్బసం నుండి ఉపశమనాన్ని అందిస్తుంది. ఇందులో యాంటీఆక్సిడెంట్లు, మెంథాల్, ఫైటోన్యూట్రియెంట్లు పుష్కలంగా ఉంటాయి. పిప్పరమెంటులోని ముఖ్యమైన నూనెలు కడుపు తిమ్మిరి, ఆమ్లత్వం, వాయువును తగ్గిస్తాయి. ఛాతీ రద్దీని తగ్గించి, శ్వాసకోశ సమస్యలను నివారిస్తుంది.

## ఇంగ్లాండ్ చేతిలో పాకిస్థాన్ జాతకం..

ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026 క్లైమాక్స్‌కు చేరుకుంది. సెమీఫైనల్ బెర్తుల కోసం జట్ల మధ్య పోరు రసవత్తరంగా మారింది. ముఖ్యంగా గ్రూప్–2లో పాకిస్థాన్ పరిస్థితి ఇప్పుడు చావు రేవో అన్నట్టుగా తయారైంది. శుక్రవారం (ఫిబ్రవరి 27) ఇంగ్లాండ్, న్యూజిలాండ్ జట్ల మధ్య జరుగుతున్న సూపర్–8 మ్యాచ్ ఫలితంపై పాకిస్థాన్ భవిష్యత్తు ఆధారపడి ఉంది. ఈ ఒక్క మ్యాచ్ పాకిస్థాన్‌ను సెమీస్‌కు చేరుస్తుందా లేక ఇంటికి పంపిస్తుందా అన్నది తేలిపోనుంది. ప్రస్తుతం పాక్ అభిమానులంతా తమ జట్టు కోసం కంటే, ఇంగ్లాండ్ గెలవాలని ఎక్కువగా కోరుకుంటున్నారు.

సూపర్–8లో గ్రూప్–2 సమీకరణాలను ఒకసారి పరిశీలిస్తే.. ఇంగ్లాండ్ ఇప్పటికే సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. శ్రీలంక జట్టు వరుస ఓటములతో టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఇప్పుడు మిగిలిన ఒకే ఒక్క సెమీస్ బెర్త్ కోసం పాకిస్థాన్, న్యూజిలాండ్ జట్లు పోటీ పడుతున్నాయి. కివీస్ జట్టు రెండు మ్యాచ్‌లు ఆడి ఒక విజయం, ఒక రద్దుతో 3 పాయింట్లు సాధించింది. మరోవైపు సల్మాన్ ఆగా నేతృత్వంలోని పాకిస్థాన్ జట్టు ఇప్పటివరకు ఆడిన రెండు మ్యాచుల్లో ఒక్క విజయాన్ని కూడా నమోదు చేయలేకపోయింది. న్యూజిలాండ్‌తో మ్యాచ్ వర్షార్పణం కావడంతో ఒక పాయింట్ రావడమే పాకిస్థాన్‌కు దక్కిన ఏకైక ఊరట.

ఇప్పుడు అసలు ముచ్చట ఏంటంటే.. ఇంగ్లాండ్‌తో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ గెలిస్తే పాకిస్థాన్ ఆశలు గల్లంతవుతాయి. కివీస్ గెలిస్తే వారి పాయింట్లు 5కి చేరుతాయి. అప్పుడు పాకిస్థాన్ తన చివరి మ్యాచ్‌లో శ్రీలంకపై గెలిచినా కేవలం 3 పాయింట్ల దగ్గరే ఆగిపోతుంది. అంటే కివీస్ విజయం పాకిస్థాన్‌కు మరణశాసనమే. ఒకవేళ ఇంగ్లాండ్ చేతిలో న్యూజిలాండ్ ఓడిపోతేనే పాకిస్థాన్‌కు చిన్నపాటి అవకాశం ఉంటుంది. అప్పుడు పాక్ తన చివరి మ్యాచ్‌లో లంకను భారీ తేడాతో ఓడించి, మెరుగైన రన్ రేట్‌తో సెమీస్ చేరే ఛాన్స్ ఉంటుంది.

పాకిస్థాన్ జట్టు ఈ సూపర్ 8లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో మ్యాచ్‌లో కేవలం 2 వికెట్ల తేడాతో ఓడిపోయి చేజేతులా సెమీస్ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. ఇప్పుడు తమ ప్రతాపం చూపడం కంటే, పక్క జట్ల ఫలితాలపై ఆధారపడటం పాక్ జట్టుకు అలవాటుగా మారింది. మరి ఇంగ్లాండ్ జట్టు న్యూజిలాండ్‌ను ఓడించి పాకిస్థాన్‌కు ప్రాణం పోస్తుందా? లేక కివీస్ గెలిచి పాకిస్థాన్‌ను విమానం ఎక్కించి పంపేస్తుందా? అన్నది తేలిపోనుంది.




## వరల్డ్ ఛాంపియన్లకు షాక్..

వరల్డ్ ఛాంపియన్ హోదాలో ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన భారత మహిళల జట్టుకు వన్డే సిరీస్‌లో చేదు అనుభవం ఎదురైంది. గతేడాది నవంబర్‌లో వన్డే వరల్డ్ కప్ గెలిచిన తర్వాత టీమిండియా ఆడుతున్న తొలి వన్డే సిరీస్ ఇదే. అయితే, పొట్టి ఫార్మాట్ (ట20)లో అదరగొట్టిన మన అమ్మాయిలు, వన్డేల్లో మాత్రం వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఓటమి పాలయ్యారు. హోబర్ట్ వేదికగా శుక్రవారం జరిగిన రెండో వన్డేలో ఆస్ట్రేలియా 5 వికెట్ల తేడాతో భారత్‌పై ఘనవిజయం సాధించి, మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్‌ను కైవసం చేసుకుంది. వరల్డ్ కప్ సెమీఫైనల్లో భారత్ చేతిలో ఓడిపోయిన ఆసీస్, ఇప్పుడు స్వదేశంలో వరుస విజయాలతో దానికి ప్రతీకారం తీర్చుకుంది.ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేసిన భారత జట్టు నిర్ణీత ఓవర్లలో 251 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఓపెనర్లు స్మృతి మంధాన (31), ప్రతికా రావల్ (52) తొలి వికెట్‌కు 78 పరుగుల భాగస్వామ్యంతో మంచి ఆరంభాన్ని ఇచ్చారు. ప్రతికా తన అర్ధ సెంచరీతో ఆకట్టుకున్నప్పటికీ, ఆ తర్వాత మిడిల్ ఆర్డర్ తడబడింది. 100 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయి భారత్ కష్టాల్లో పడింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ పోరాడినప్పటికీ, అవతలి వైపు నుంచి ఆమెకు సరైన సహకారం అందలేదు. కాశ్వీ గౌతమ్ (25) తో కలిసి హర్మన్ 55 పరుగులు జోడించడంతో భారత్ గౌరవప్రదమైన స్కోరు సాధించింది. కానీ, ఆస్ట్రేలియా బ్యాటర్ల జోరు ముందు ఈ లక్ష్యం చాలా చిన్నదైపోయింది.

252 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియాకు ఓపెనర్ ఫీబీ లిచ్‌ఫీల్డ్, జార్జియా వాల్ అద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చారు. తన కెరీర్‌లో చివరి సిరీస్ ఆడుతున్న ఆసీస్ కెప్టెన్ అలిస్సా హీలీ (6) త్వరగానే అవుట్ అయినప్పటికీ, ఆ జట్టు ఏమాత్రం ఒత్తిడికి లోను కాలేదు. లిచ్‌ఫీల్డ్ కేవలం 62 బంతుల్లో 80 పరుగులు చేసి విధ్వంసం సృష్టించగా, 22 ఏళ్ల జార్జియా వాల్ (101 పరుగులు, 82 బంతులు) సెంచరీతో చెలరేగిపోయింది. వీరిద్దరూ రెండో వికెట్‌కు 119 పరుగులు జోడించి భారత్ ఆశలపై నీళ్లు చల్లారు. ముఖ్యంగా జార్జియా వాల్ కేవలం 80 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసి ఆసీస్ విజయాన్ని సులభతరం చేసింది.భారత బౌలర్లు మధ్యలో మూడు వికెట్లు తీసి పుంజుకునే ప్రయత్నం చేసినప్పటికీ, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఆస్ట్రేలియా కేవలం 36.1 ఓవర్లలోనే, అంటే మరో 83 బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించింది. హర్మన్‌ప్రీత్ సేన వరల్డ్ కప్ గెలిచిన తర్వాత ఆడిన తొలి వన్డే సిరీస్‌లోనే ఓటమిని చవిచూడటం అభిమానులను కాస్త నిరాశకు గురిచేసింది. సిరీస్ కోల్పోయిన భారత్, కనీసం చివరి మ్యాచ్‌నైనా గెలిచి పరువు నిలుపుకోవాలని చూస్తోంది. సిరీస్‌లో మూడో వన్డే ఇదే వేదికపై మార్చి 1న జరగనుంది.



Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H No: 21-119, West Ibrahimpatnam, Krishna, Andhra Pradesh - 521456. . Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2844. Ph:9849707349 email:kvp6858@gmail.com